నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I హైదరాబాద్, సోమవారం 26 ఆగస్టు 2024 HYDERABAD

## లిఫ్టు వచ్చిందని భావించి..కాలు పెట్టడంతో..



మెహిదీపట్నం, ఆగస్టు 25: నాలుగో అంతస్తులో ఉన్న ఓ వ్యక్తి కిందకు దిగేందుకు లిఫ్టు వద్దకు వచ్చాడు. లిఫ్టు డోర్ తెరుచుకుంది. లిఫ్టు వచ్చినట్టుగా భావించిన అతడు కాలు లోపల పెట్టడంతో.. ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు పైనుంచి కిందపడి గాయాలతో మృతి చెందాడు. ఈ ఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మెహిదీపట్నం ప్రియా కాలనీలోని వకాస్ స్క్వేర్ అపార్టుమెంట్ నివాసి సమీవుల్లా బేగ్(55) వ్యాపారి. ఆదివారం సాయంత్రం అపార్టుమెంట్ నుంచి కిందకు వచ్చేందుకు అతడు లిఫ్ట్ వద్దకు చేరుకున్నాడు. లిఫ్ట్ వచ్చినట్టు భావించి..దాని డోర్ తీసి లోపల అడుగుపెట్టాడు. అక్కడ లిఫ్ట్ లేకపోవడంతో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. నాలుగో అంతస్తు పైనుంచి పడటంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఆసిఫ్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

# జై జై గణేశా..



రూపుదిద్దుకుంటున్న ఖైరతాబాద్ మహాగణపతి





సిటీబ్యూరో: వినాయకచవితి సమీపిస్తుండటంతో నగరంలో వినాయక ప్రతిమలు విభిన్న రూపాల్లో అందంగా రూపుదిద్దుకుంటున్నాయి. కొన్ని చోట్ల విగ్రహాల విక్రయాలూ జోరందుకున్నాయి. ఈ ఏడాది శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతిగా దర్శనమివ్వనున్న ఖైరతాబాద్ గణేశుడు.. 70 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పుతో భక్తులకు కనువిందు చేయనున్నాడు. ఈ నేపథ్యంలో విగ్రహ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా..వచ్చే నెల 7న వినాయక చవితితో ప్రారంభమయ్యే వేడుకలు 17న నిమజ్జనంతో ముగుస్తాయని సీపీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మండపాలను ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా స్థానిక ఏసీపీల నుంచి పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ఏర్పాట్లు, నిమజ్జనానికి సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకోవాలని, ఇందుకు హైదరాబాద్ పోలీస్.జీవోవీ. ఇన్, పోలీస్ పోర్టల్. టీఎస్‌పోలీస్.జీవోవీ. ఇన్ వెబ్‌సైట్ల నుంచి ఫారాలు పొందవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు 8712665785 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

# ఎమర్జెన్సీ కాకున్నా.. సైరన్!

## చిన్నచిన్న కారణాలకే మోగిస్తూ.. దూసుకెళ్తున్న అంబులెన్స్‌లు

**రోగికి అత్యవసర సమయాల్లో వైద్యసేవలు అందించేందుకు సైరన్‌ను వాడుతూ.. అంబులెన్స్‌లు వేగంగా వెళ్లాల్సిన అవసరం ఉంటుంది. ఆ సమయంలో ట్రాఫిక్ పోలీసులు సైతం రూట్ క్లియర్ చేస్తుంటారు. అయితే ఇటీవల ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన సర్వేలో చాలా సందర్భాల్లో అత్యవసర సమయం కానప్పుడు కూడా అంబులెన్స్ డైవర్లు.. సైరన్లు వాడుతూ.. వెళ్తున్నట్లు గుర్తించారు. చికిత్స అనంతరం రోగి ఇంటికి వెళ్లే సమయంలో..అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు.. ఉద్యోగులను..వివిధ రకాల శాంపిల్స్ కలెక్షన్లు తీసుకెళ్లేటప్పుడు.. మృతదేహాలను తరలించేటప్పుడు..ఇలా అంబులెన్స్ డ్రైవర్లు సైరన్‌ను ఉపయోగిస్తున్నట్లు తేలింది. అత్యవసర సమయాల్లోనే సైరన్‌ను వాడాలని.. దుర్వినియోగం చేయవద్దని డ్రైవర్లకు నగర ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.**

*- సిటీబ్యూరో, ఆగస్టు 25(నమస్తేతెలంగాణ)*

**49 శాతం శాంపిల్స్ కోసమేనట..**

**ట్రాఫిక్ పోలీసుల సర్వేలో పలు అంశాలు గుర్తింపు**


**సైరన్‌ను దుర్వినియోగం చేయొద్దు**



**అంబులెన్స్ డ్రైవర్లకు పోలీసుల స్పష్టీకరణ**

**స్వీయ నియంత్రణ అవసరమంటూ.. హితవు**

**అత్యవసర సమయాల్లోనే సైరన్ వాడాలంటూ సూచన**




ట్రాఫిక్ పోలీసులు అంబులెన్స్ సర్వీస్‌లకు సంబంధించిన సైరన్‌ను ఎలా వాడుతున్నారు..దాని దుర్వినియోగంపై ఒక సర్వే చేశారు. ఇందుకు గత నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ మధ్యలో అక్కడక్కడ జంక్షన్ల వద్ద 310 అంబులెన్స్ సేవల గురించి ఆరా తీశారు. అందులో అత్యధికంగా 152 అంబులెన్స్‌లు (49%) శాంపిల్స్ తీసుకొని వెళ్తున్నవే ఉన్నాయి.. అలాగే వివిధ కారణాలు చెప్పినవి 121 (39%), మృతదేహాలను తీసుకెళ్తున్నవి 20 (6.5%), ఖాళీగా వెళ్తున్నవి 17 (5.5%) ఉన్నట్లు తేలింది. ఇలా సగానికిపైగా అంబులెన్స్‌ల సైరన్లు దుర్వినియోగం అవుతున్నట్లు పోలీసులు గుర్తించారు. రోగికి అత్యవసరంగా వైద్యసేవలు అందించేందుకు సైరన్‌ను వాడుతూ.. అందరి సహకారంతో అంబులెన్స్‌లు వేగంగా వెళ్లాల్సిన అవసరముంటుంది. అయితే ఆ రోగికి అత్యవసరం కాకున్నా..అంబులెన్స్ ఉందంటే సైరన్ వేసుకొని వెళ్లేవారు చాలా మంది ఉంటున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు.. ఎవరైనా ప్రాణపాయం స్థితిలో ఉంటే.. అప్పుడే పుట్టిన పసిపాపలు.. ఇలా కొన్ని సందర్భాల్లో తప్పని సరిగా అంబులెన్స్ సైరన్ వాడాల్సిందేనని పోలీసులు సూచిస్తున్నారు. రోగి చికిత్స అనంతరం అంబులెన్స్‌లో ఇంటికి వెళ్తుండటం, మృతదేహాలను తరలించడం, అనారోగ్యంగా ఉన్న వారిని, ఉద్యోగులను, వివిధ రకాలైన శాంపిల్స్ కలెక్షన్ తీసికెళ్లే సమయంలోనూ అంబులెన్స్ సైరన్‌ను దుర్వినియోగం చేయవద్దని నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ సూచించారు.

### 5 నుంచి 6 అంబులెన్స్‌లు..

అంబులెన్స్ సైరన్‌తో వెళ్తుంటే.. రోడ్డుపై వెళ్లే వాహనదారులతో పాటు జంక్షన్ల వద్ద పోలీసులు ట్రాఫిక్ క్లియరెన్స్ ఇస్తుంటారు. ఆటోమెటిక్ వ్యవస్థ ఉన్న చోట ట్రాఫిక్ పోలీసులు అప్పటికప్పుడు సిగ్నళ్లను మ్యానువల్‌గా మార్చేసి అంబులెన్స్‌లకు దారిస్తుంటారు. ఇలా ఒక గంటలో ఒక జంక్షన్ నుంచి 5 నుంచి 6 అంబులెన్స్‌లు వెళ్తుంటాయి. ఆ సమయంలో ఆటోమెటిక్ నుంచి మ్యానువల్ మోడ్‌కు సిగ్నల్ వ్యవస్థను మార్చాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే కొన్ని అంబులెన్స్‌లు నాన్ ఎమర్జెన్సీ సందర్భాల్లోనూ సైరన్ మోగిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు సర్వే ద్వారా గుర్తించారు.

### త్వరలోనే సాఫ్ట్‌వేర్

అంబులెన్స్ డ్రైవర్లకు అవగాహన కల్పించడంలో భాగంగా ఇటీవల కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో హాస్పిటల్ యాజమాన్యాలు, ప్రైవేట్ అంబులెన్స్ అసోసియేషన్స్, అంబులెన్స్‌లు కలిగి ఉన్న డయాగ్నోస్టిక్ లాబరేటరీస్ యాజమాన్యాలతో నగర ట్రాఫిక్ పోలీస్ అదనపు సీపీ విశ్వప్రసాద్ నేతృత్వంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. అంబులెన్స్ సైరన్‌ను దుర్వినియోగం చేయవద్దని, అత్యవసర పరిస్థితులు, అత్యవసరం కాని పరిస్థితులను వేర్వేరుగా చూడాలని సూచించారు. ఇందుకు స్వీయ నియంత్రణ అవసరమని అంబులెన్స్ డ్రైవర్లకు, దవాఖానల యాజమాన్యాలకు సూచించారు. ఎమర్జెన్సీ, నాన్ ఎమర్జెన్సీలకు సంబంధించిన ఏర్పాట్ల విషయంలో ఒక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను తయారు చేస్తున్నామని, త్వరలోనే దానిని అందుబాటులో తేనున్నట్లు చెప్పారు.



## తేలికపాటి జల్లులు

సిటీబ్యూరో, ఆగస్టు 25(నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం ప్రభావంతో రాగల రెండురోజుల్లో గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఆవర్తనం ప్రభావంతో ఆదివారం ఉదయం నుంచి వాతావరణం మేఘావృతంగా మారింది. గచ్చిబౌలి, షేక్‌పేట, బోడుప్పల్, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 29.4, కనిష్ఠం 22.6 డిగ్రీలు, గాలిలో తేమ 71శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

### 'ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్'పై నామినేషన్స్

సిటీబ్యూరో, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ ): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్, కేంద్ర విద్యాలయాల పాఠశాలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలల యాజమాన్యాలు కచ్చితంగా తమ పాఠశాలల నుంచి ఐదుగురు విద్యార్థులకు 'ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్ 2024-25' నామినేషన్స్ చేయాలని జిల్లా విద్యాశాఖధికారిని రోహిణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్ ప్రక్రియపై ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్ రావు 7799171277, 7981 950513, 6300869388 నంబర్లలో సంప్రదించాలని రోహిణి సూచించారు.



**అదిరేలా.. మారథాన్**

*హైదరాబాద్ రన్నర్స్, ఎన్ఎండీసీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో నిర్వహించిన 13వ ఎడిషన్ హైదరాబాద్ మారథాన్ ఉత్సాహంగా సాగింది. మొత్తం 4 కేటగిరీల్లో జరిగిన ఈ మారథాన్‌లో 25,500 మంది క్రీడాకారులు భాగస్వాములయ్యారు. పీపుల్స్‌ప్లాజా నుంచి ప్రారంభమైన ఈ రన్ గచ్చిబౌలి వరకు సాగింది.*

# ఖాకీ..కాసుల కక్కుర్తి..!


## పైసలిస్తే చాలు.. 'నో' అరెస్ట్

లైంగికదాడి కేసుల్లో లక్షలతో రాజీ

నెల వారీగా రూ.4 లక్షల మామూళ్లే టార్గెట్

సెటిల్‌మెంట్ల కింగ్‌గా ఆ ఠాణా ఇన్‌స్పెక్టర్

కీలక జోన్‌లో ఆ పీఎస్ పేరు చెబితే హడల్




వెంగళరావునగర్, ఆగస్టు 25: నగరంలో కీలకమైన జోన్‌లో కొందరు పోలీసులు సెటిల్‌మెంట్లు, వ్యభిచార గృహాల నుంచి నెల వారీ మామూళ్లు తీసుకుంటున్నారు. కొన్నిసార్లు చట్టం నేరస్తులకు చుట్టమవుతోంది. క్రిమినల్స్‌కు అండగా ఖాకీలు నిలుస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడుతూ.. నేరస్తులు చట్టం నుంచి తప్పించుకోవాలంటే ఏం చేయాలో సూచిస్తూ.. తాము అడిగినంత ఇస్తే.. అటు మేం బాగుంటాం.. ఇటు మీరూ బాగుంటరంటూ సెటిల్‌మెంట్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కీలక జోన్‌లోని ఓ కీలక పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న అధికారి నేరుగా సెటిల్‌మెంట్లకు అలవాటుపడ్డాడు. స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయకపోగా.. ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదుదారులపైనే తప్పుడు సమాచారమిస్తూ నిందితులకు తన వంతు సహకారం అందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సెటిల్‌మెంట్ల వ్యవహారంలో అక్కడ పనిచేసే ఇన్‌స్పెక్టర్, డీఐ, ఎస్సైల మధ్య అంతర్గత యుద్ధం జరుగుతున్నదని సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఈ ఠాణాలో సెటిల్‌మెంట్ కింగ్‌గా మారిన ఆ ఇన్‌స్పెక్టర్ పేరు చెబితే.. ఆ పీఎస్‌లో హడలెత్తిపోతున్నారు.

### రూ.6 లక్షలు..

అనంతపురానికి చెందిన వివాహిత (29) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసింది. ఆమె చేస్తున్న ఆ ప్రాజెక్ట్ పూర్తవ్వడంతో ఉద్యోగం పోయింది. ఆమె మళ్లీ ఉద్యోగ ప్రయత్నం చేస్తున్న సమయంలో ఫేస్‌బుక్‌లో హైదరాబాద్‌కు చెందిన ఓ యువకుడు పరిచయమయ్యాడు. తాను జాబ్ కన్సల్టెంట్‌నని, హైదరాబాద్‌కు వస్తే ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మించాడు. దీంతో ఆమె తన భర్త, నాలుగేండ్ల కుమారుడితో కలిసి నగరానికి వచ్చింది. తన కార్యాలయానికి రెజ్యూమ్‌తో రావాలని అతడు సూచించాడు. దీంతో ఆమె అక్కడికి వెళ్లడంతో లైంగికదాడికి పాల్పడ్డాడు. బయటకు వచ్చి ఏడుస్తుండటంతో మరో యువతి అక్కడికి వచ్చి.. తనకు కూడా అన్యాయం చేశాడని, వీడిని ఎలా నమ్మి ఇంతదూరం వచ్చావంటూ చెప్పింది. దీంతో బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా.. లైంగికదాడికి పాల్పడ్డ నిందితుడు అతడి స్నేహితుడికి బాధితురాలి నంబర్ ఇచ్చాడు. అతడు కూడా తాను ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఫోన్ చేసి.. వేధింపులకు గురిచేయడం ప్రారంభించాడు. దీనిపై కూడా బాధితురాలు ఫిర్యాదు చేయడంతో మరో కేసు నమోదైంది. ఈ కేసులో ఇన్‌స్పెక్టర్ మొదట బాధితురాలిపైనే ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారమిచ్చాడు. ఆమె డబ్బులు ఆశిస్తుందంటూ అధికారులకు చెప్పి.. ఆ కేసు తీవ్రతను తగ్గించాడు. ఆ తరువాత రెండు కేసుల్లో నిందితులను పిలిపించాడు. 'కేసు పెద్దదవుతోంది.. నేను ఆ అమ్మాయితో మాట్లాడుతాను.. మీరు రూ. 6 లక్షలు ఇవ్వండి' అంటూ సెటిల్‌మెంట్ చేశాడు. నిందితుల నుంచి రూ. 6 లక్షలు వసూలు చేసి.. అందులో సగం బాధితురాలికి ఇచ్చి.. మిగతా సగం రూ. 3 లక్షలు ఇన్‌స్పెక్టర్ కొట్టేశాడనే ఆరోపణలు ఉన్నాయి. 'పెండ్లయ్యింది. పిల్లలున్నారు. కేసులు పెట్టుకొని ఎన్నాళ్లు కొట్లాడుతావు. డబ్బులు వచ్చాయి. ఈ కేసు మర్చిపో'.. అంటూ బాధితురాలికి ఉచిత సలహా ఇచ్చాడు. 'నీవు కేసు విత్‌డ్రా చేసుకుంటున్నట్లు కోర్టులో ఒక పిటిషన్ వేస్తే. అటు నిందితులు సేఫ్ అవుతారు.. మేం కూడా.. నీవు కోర్టులో పిటిషన్ వేశావని కేసు క్లోజ్ చేస్తాం.. ఎవరి చేతికి మట్టి అంటకుండా అన్ని సర్దుకుంటాయి'.. అంటూ ఆ ఇన్‌స్పెక్టర్ బాధితురాలు, నిందితుల మధ్య రాజీ కుదిర్చి సెటిల్‌మెంట్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

### లక్ష ఇవ్వకుంటే అరెస్ట్ చేస్తా..

తనతో సహజీవనం చేసి పిల్లలు పుట్టిన తరువాత ఒక వ్యాపారి మోసం చేశాడని, అతడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలంటూ ఓ మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అయితే, ఈ కేసులో ఒక బస్తీ లీడర్ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి.. సెటిల్‌మెంట్ చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. 'నీవేమి చేసుకుంటావో నీ ఇష్టం. నాకు లక్ష రూపాయలు ఇప్పించు. లేదంటే వ్యాపారిని అరెస్ట్ చేస్తా'.. అంటూ మధ్యవర్తితో భేరం కుదుర్చుకున్నాడు. చివరకు లక్ష రూపాయలు ఇవ్వడంతో ఆ కేసును ఇన్‌స్పెక్టర్ పక్కన పెట్టాడు. బాధితురాలు స్టేషన్ చుట్టూ తిరుగుతోంది.



### వ్యాపారి నుంచి రూ. 50వేలు..

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఓ వ్యాపారిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని ఠాణాలో అప్పగిస్తే, ఆ వ్యాపారి వద్ద నుంచి రూ. 50 వేలు వసూలు చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. మరో ఘటనలో ఇదే ఠాణాలో పనిచేసే ఇద్దరు క్రైమ్ కానిస్టేబుళ్లు పక్కనే ఉన్న మరో కమిషనరేట్‌లోని స్క్రాప్ వ్యాపారిని బెదిరించి.. లక్ష రూపాయలు వసూలు చేశారనే విమర్శలు ఉన్నాయి. ఈ స్టేషన్‌కు నెలకు రూ. 4 లక్షల వరకు మామూళ్లు వస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గస్తీ, పెట్రోలింగ్ చేసే సిబ్బందికి టార్గెట్లు ఇస్తూ.. వసూళ్లు చేయిస్తున్నారనే విమర్శలున్నాయి.